సాక్షి నల్లగొండ

మంగళవారం । 6 । ఆగస్టు । 2024



బీసీ వర్గీకరణ చేపట్టాలి

బీసీల్లోని వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు అందాలంటే వర్గీకరణ చేపట్టాలని తమ్మినేని వీరభద్రం కోరారు.

- 8లో



హాస్టల్ కేటాయించొద్దని..

మాడ్గులపల్లి కేజీబీవీకి విద్యార్థినులను వేములపల్లి మోడల్‌స్కూల్‌కు తరలించడంపై విద్యార్థినులు ఆందోళన చేశారు.


- 8లో



అంబులెన్స్ డ్రైవర్ దుర్మరణం

అర్వపల్లిలో బైక్‌పై వెళ్తూ రోడ్డు క్రాస్ చేస్తున్న 104 అంబులెన్స్ డ్రైవర్‌ను కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు.

- 8లో



సోమవారం రాత్రి 20 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ

కృష్ణమ్మ గలగలలు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు 20 క్రస్ట్ గేట్ల గుండా పరవళ్లు

- 585 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం
- 2,24,971 క్యూసెక్కులు దిగువకు విడుదల

- సోమవారం ఉదయం 11.45 గంటలకు గేట్లు ఎత్తిన అధికారులు
- తొలుత ఆరు.. మధ్యాహ్నం 12.. సాయంత్రం 16.. రాత్రి పది గంటలకు 20 గేట్లు ఎత్తివేత
- శ్రీశైలం జలాశయం నుంచి 2,76,203 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కృష్ణమ్మ అందాలు చూసి పరవశించిపోతున్న పర్యాటకులు

నాగార్జునసాగర్: సాగర్ వద్ద 20 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఎగువగల శ్రీశైలం జలాశయం నుంచి 2,76,203 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్ జలాశయంలోకి విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం నీటి మట్టం 582.90అడుగులకు(291.3895టీఎంసీలు) చేరగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 11:45 గంటలకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నాగేశ్వర్‌రావు 13వ గేటు స్విచ్ ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. కృష్ణమ్మకు పూజలు చేశారు. ముందుగా 6గేట్లు, అనంతరం 10గేట్లు ఎత్తారు. సాయంత్రం నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి చేతులమీదుగా 4గేట్లు ఎత్తి కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. ఆరు గంటలకు మరో రెండు గేట్లు ఎత్తారు. మొత్తం 16గేట్లు ఐదు అడుగులపైకి ఎత్తారు. వరద ఎగువ నుంచి పెరగడంతో రాత్రి 10గంటలకు మరో నాలుగు.. మొత్తం 20 గేట్లు ఎత్తారు. స్పిల్‌వే మీదుగా 1,96,064 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పాదన ద్వారా మరో 28,907 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా.. మొత్తంగా దిగువ నదిలోకి 2,24,971 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణానదిలోకి విడుదలవుతోంది. సాగర్ జలాశయం గరిష్ఠ నీటి మట్టం 590 అడుగులు కాగా నీటి నిల్వ సామర్థ్యం 312.5050 టీఎంసీలు.

పర్యాటకుల సందడి

రెండేళ్ల తర్వాత సాగర్ గేట్లు ఎత్తడంతో ముందుగానే మీడియా ద్వారా తెలుసుకున్న పర్యాటకులు కృష్ణమ్మ పరవళ్లు వీక్షించేందుకు తరలివచ్చారు. కృష్ణమ్మ.. స్పిల్‌వేమీదుగా దిగువకు దుముకుతున్న సుందర దృశ్యం తమ సెల్‌ఫోన్లలో బంధించారు. ఎండ మెండుగా ఉండటంతో బత్తాయిరసం విక్రయించే తోపుడు బండ్లు కృష్ణాతీరంలో వెలిశాయి.



హుజూర్‌నగర్ : పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న నీరు

పులిచింతల నుంచి నాలుగు గేట్ల ద్వారా..

హుజూర్‌నగర్ : చింతలపాలెం మండలంలో కృష్ణానదిపై గల పులిచింతల ప్రాజెక్టు నుంచి సోమవారం నీటి విడుదల ప్రారంభమైంది. కృష్ణాడెల్టాలో ఆయకట్టుకు నీరు అవసర పడటంతో అధికారులు పులిచింతల ప్రాజెక్టు 24గేట్లకు గాను 4 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఒక గేటును 2.5 మీటర్లు, మూడు గేట్లను 2 మీటర్లు పైకి ఎత్తి రూ 26,083 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా ఎగువన ఉన్న నాగార్జునసాగర్ నుంచి 67,112 క్యూస్కెల ఇన్‌ఫ్లో పులిచింతలకు వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.10 టీఎంసీల నీరు ఉంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 53.34 మీటర్లు కాగా ప్రస్తుతం 40.20 మీటర్లు ఉంది. ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో గంటగంటకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం టీఎస్ జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.



సాగర్‌లో క్రస్ట్ గేట్లు ఎత్తేందుకు స్విచ్ ఆన్ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి


సాగర్ ఆయకట్టులో రెండు పంటలకు నీళ్లిస్తాం

- కలెక్టర్ నారాయణరెడ్డి

నాగార్జునసాగర్ : సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కింద రెండు పంటలకు నీరిస్తామని నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాగర్ జలాశయం గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసే కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం విలేకరుతో మాట్లాడారు. సాగర్ ఆయకట్టుకు ముందస్తుగానే నీటిని విడుదల చేయడంతో రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఎడమ కాల్వ కొన్నిచోట్ల బలహీనంగా ఉండటంతో నీటిని నెమ్మదిగా పెంచుతూ విడుదల చేస్తున్నట్లు తెలిపారు. బలహీనంగా ఉన్నచోట్ల మరమ్మతులు చేస్తూ పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేస్తామన్నారు. రైతులు సాగునీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ వారంలోపూ పూర్తి స్థాయిలో నీటిని వదిలి చెరువులన్నీ నింపుతామని తెలిపారు.

తీర ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలి

నదీతీరంలో ఉన్న తండాలు, గ్రామాల రైతులు, పశు, జీవాల కాపరులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా నదిలోకి ఈతకు వెళ్ల వద్దని పశువులను నదిలోకి తోలుకపోవద్దన్నారు. మత్స్యకారులు చేపలు పట్టేందుకు నదిలోకి, జలాశయంలోకి వెళ్ల వద్దని హెచ్చరించారు.



టెయిల్‌పాండ్ నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

టెయిల్‌పాండ్ దిగువకు నీటి విడుదల

అడవిదేవులపల్లి : నాగార్జున సాగర్ జలాశయం నుంచి టెయిల్‌పాండ్‌కు సోమవారం మధ్యాహ్నం 1,32,794 క్యూసెక్కుల నీరు చేరుతుండడంతో టెయిల్‌పాండ్ గేట్లెత్తి అధికారులు 1,32,411 క్యూసెక్కుల నీటిని దిగువగకు విడుదల చేస్తున్నారు. టెయిల్‌పాండ్ దిగువ ప్రాంతాలైన చిట్యాల, అడవిదేవులపల్లి, ముదిమాణిక్యం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జాలర్లు వేటకు వెళ్లవద్దని తహసీల్దార్ సురేష్‌కుమార్ సూచించారు. ఆయన వెంట ఆర్ఐ శ్యాం సుందర్ ఉన్నారు.

న్యూస్‌రీల్

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

నల్లగొండ : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఫిర్యాదుల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పోలీస్ గ్రీవెన్స్ డే ఫిర్యాదులను..



గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం : పోలీస్ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు భరోసా కల్పించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో మాట్లాడారు. భూ సమస్యలు, కుటుంబ తగాదాలు, ఫైనాన్స్ సమస్యలపైన ఎక్కువగా ఫిర్యాదులు అందాయన్నారు. క్షేత్రస్థాయిలో విచారించి తగిన నివేదిక ఇవ్వాలని శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్ చేయాలన్నారు. పోలీస్ శాఖపై ప్రజల్లో భరోసా కలిగించేలా సమర్థంగా విధులు నిర్వహించాలన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు దరఖాస్తులు

నల్లగొండ : 2024–25 విద్యా సంవత్సరం ఓపెన్ స్కూల్ ఇంటర్, పదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఈ నెల 8 నుంచి అక్టోబరు 3 వరకు విక్రయిస్తున్నట్లు డీఈఓ భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దిష్ట రుసుంతో ఈ నెల 8 నుంచి సెప్టెంబర్ 10 వరకు, ఆలస్య రుసుంతో అక్టోబరు 3 వరకు దరఖాస్తులు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ జె.జగదీష్‌కుమార్ 8008403523 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఊరూరా ‘స్వచ్ఛదనం పచ్చదనం’

- తొలిరోజు అంతటా ర్యాలీలు
- ఈ ఐదు రోజుల్లో చేపట్టాల్సిన ప్రణాళికపై చర్చ
- పాల్గొన్న శాసనమండలి చైర్మన్, కలెక్టర్, ఎమ్మెల్యేలు

నల్లగొండ : ప్రభుత్వం చేపట్టిన ‘స్వచ్ఛదనం పచ్చదనం’ ఐదు రోజుల కార్యక్రమం తొలి రోజు సోమవారం గ్రామాలు, పట్టణాల్లో ర్యాలీలతో ప్రారంభమైంది. అనంతరం ప్రత్యేకాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ ఐదు రోజులు ఏఏ కార్యక్రమాలు చేపట్టాలో ప్రణాళిక రూపొందిచారు. మొదటి రోజు ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, రాజగోపాల్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాలు, పట్టణాల్లో ర్యాలీలు..

స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు గ్రామాలు, పట్టణాల్లో ప్రజలతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. స్థానిక నాయకుల ఆధ్వర్యంలో స్వయం సహాయక బృందాలు, యువత, వార్డు కమిటీలు ర్యాలీల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా వీధి కుక్కల బెడద నివారించేదుకు తగు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.



మొక్కలను పంపిణీ చేస్తున్న గుత్తా సుఖేందర్ రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీరేశం

నేడు తాగునీటిపై అవగాహన

ప్రతి గ్రామం, మున్సిపాలిటీల్లో మంగళవారం తాగునీటిపై కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తాగునీటికి సంబంధించి ట్యాంకుల క్లీనింగ్‌తో పాటు, పైప్‌లైన్ మరమ్మతు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

- 3వ రోజైన బుధవారం గ్రామాల్లో డ్రెయినేజీలు శుభ్రం చేయడంతోపాటు వీధుల్లో ఉన్న గుంతలు పూడ్చటం, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- 4వ రోజైన గురువారం ఆరోగ్య సంబంధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రామాల్లో తిరుగుతూ జ్వర, డెంగీ సర్వేలు నిర్వహించనున్నారు. జ్వరాలు ఉన్న వారిని గుర్తించి వారికి అవసరమైన వైద్యం, మందులు అందిస్తారు.
- చివరి రోజైన శుక్రవారం రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటటంతో పాటు గతంలో చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటడం, పంచాయతీల్లో ఖాళీ స్థలాలు గుర్తించి వనమహోత్సవం నిర్వహిస్తారు. దాంతోపాటు గ్రామాల్లో ఉన్న అన్ని ప్రభుత్వ భవనాలను శుభ్రం చేస్తారు. ప్రజలు కూడా వారి గృహాలను శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది. ఖాళీ సీసాలు, వాడి పడేసిన కప్పులు పడేయడం, వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడటం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

గ్లోబల్ వార్మింగ్‌ను నివారించాలి

- శాసన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

చిట్యాల : రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచి గ్లోబల్ వార్మింగ్‌ను నివారించేందుకు ప్రజలంతా కృషిచేయాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. చిట్యాల మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన ‘స్వచ్ఛదనం–పచ్చదనం’ కార్యక్రమంలో ఆయన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ సి.నారాయణరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ చెట్ల నరికివేతతో పాటు మొక్కలు పెంచకపోవడంతో వాతావరణంలో సమతుల్యత దెబ్బతింటుందన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ×స్వచ్ఛదనం–పచ్చదనం॰ కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. అనంతరం పలువురికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, మున్సిపల్ కమిషనర్ వీరేందర్, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

డిండి : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతోపాటు ఎన్నికల హామీలన్నీ అమలు చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం డిండిలో సీపీఐ మండల కౌన్సిల్ నిర్మాణ సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2 లక్షల రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా వర్తింజేయాలని, రైతు భరోసా అందించాలని కోరారు. పేదలందరికీ ఇండ్ల స్థలాలతోపాటు ఇంటిని నిర్మించి ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిండి, ఎస్ఎల్‌బీసీకి సరిపడా నిధులు మంజూరు చేసి రానున్న వెంటనే పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు ప్రాంతాలకు సాగు, తాగు నీరందించాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, బొడ్డుపల్లి వెంకటరమణ, తూం బుచ్చిరెడ్డి, ఎండీ.మైనొద్దీన్, కనకాచారి, బొల్లె శైలేష్, విజయేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నీవన్, కేశవులు, గోవర్ధన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

శిక్షణ తరగతులు విజయవంతం చేయాలి

నల్లగొండ టౌన్ : హైదరాబాద్‌లో ఈ నెల 26 నుంచి 28 వరకు జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య తెలిపారు. సోమవారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన్న వెంకులు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో నాగయ్య మాట్లాడారు. ఎన్నికల్లో వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నారి ఐలయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు దండంపల్లి సరోజ, కత్తుల లింగస్వామి, రవినాయక్, పిల్లుట్ల సైదులు, మన్నె భిక్షం, అరూరి నరసింహ, కొమ్ము లక్ష్మయ్య, నాగయ్య, సాగర్ల మహేష్, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు పాస్‌పుస్తకం అందిస్తాం

- కలెక్టర్ నారాయణరెడ్డి
- చింతలపాలెంలో గ్రామసభ

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : కాస్తు కబ్జా కలిగి ఉన్న రైతులకు ఎంజాయిమెంట్ సర్వే నిర్వహించి పట్టాదార్ పాస్‌పుస్తకాలు అందిస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి అధ్యాయనానికి శ్రీకారం చుట్టింది. అందుకోసం నూతన ఆర్‌ఓఆర్-2024 చట్టాన్ని తీసుకువచ్చే క్రమంలో అన్ని రకాల భూసమస్యల పరిష్కారానికి గాను తిరుమలగిరి(సాగర్) మండలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. అందులో భాగంగా కలెక్టర్ నారాయణరెడ్డి సోమవారం మండలంలోని చింతలపాలెం గ్రామపంచాయతీలో రైతులతో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చండూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మొత్తం ఐదు రెవెన్యూ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేటి నుంచి ఈ బృందాలు గ్రామాల్లో పర్యటిస్తూ పూర్తిస్థాయిలో సర్వే నిర్వహిస్తాయని పేర్కొన్నారు. ఆర్ఎస్ఆర్ కంటే ఎక్కువ భూమి కలిగి ఉన్న బోగస్ పట్టాలు తొలగించి అర్హులైన రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు అందిస్తామన్నారు. సర్వే చేసిన వెంటనే ఆన్‌లైన్ చేసి, మరుసటి రోజునే ఆ గ్రామ నోటీస్ బోర్డులో సర్వే వివరాలను ఉంచుతామని తెలిపారు. మండలంలో మొత్తం 7 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని.. అందులో కాంధిశికుల భూమి 3 వేల ఎకరాలు, అసైండ్ ల్యాండ్ (ప్రభుత్వ భూమి) 4 వేల ఎకరాలు ఉన్నట్లుగా గుర్తించామని తెలిపారు. అధికారులు గ్రామాలకు వచ్చినప్పుడు అందరూ సహకరిస్తే వారం, పది రోజుల్లో సర్వే పూర్తి చేసి పట్టాలు అందిస్తామన్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ, చండూరు ఆర్డీవోలు శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, తహసీల్దార్లు శ్రీనివాసశర్మ, కృష్ణయ్య, జవహర్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.



చింతలపాలెంలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

గుణాత్మక విద్యనందించాలి..

ప్రభుత్వ పాఠశాలల ద్వారా గుణాత్మకమైన విద్యను అందించి ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రచెరువుతండా ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి వారి సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనం సరిగ్గా పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- డీఎంహెచ్ఓ పి.శ్రీనివాస్


నల్లగొండ టౌన్ : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ పి.శ్రీనివాస్ అన్నారు. నల్లగొండలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిస్తూ వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రత పాటించాలన్నారు. వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అందుబాటులో ఉండని వైద్యులపై కలెక్టర్ సహకారంతో శాఖాపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా వ్యాధుల నిర్ధారణ పరీక్షలకు కావాల్సిన కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. డెంగీ పరీక్షలు కేవలం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నిర్వహిస్తారని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులు తప్పుడు పరీక్షలు చేసి ప్లేట్‌లెట్స్ తగ్గాయని చెప్పి రోగుల నుంచి డబ్బు వసూలు చేసినట్లు తెలిస్తే.. సంబంధిత ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాన్యంచల్క అర్బన్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ శ్రీనివాస్

అర్బన్ సెంటర్ తనిఖీ

నల్లగొండ పట్టణంలోని మాన్యంచల్క అర్బన్ హెల్త్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ సోమవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవల వివరాలను సిబ్బంది, రోగులను అడిగి తెలుసుకున్నారు.



సాయంకాలం.. సాగర సోయగం : నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు



కళకళ జలకళ : నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిసరాలు



కృష్ణమ్మకు పూజలు : నీటిని విడుదల చేసి పూలు చల్లుతున్న ఎన్ఎస్పీ అధికారులు



ఎన్నాళ్లకెన్నాళ్లకు.. : సాగర్ వ్యూ పాయింట్ వద్ద పర్యాటకులు



బారులుదీరిన పర్యాటకుల వాహనాలు



ఇక ఫుల్లు గిరాకీ : నీటి విడుదలను చూస్తున్న జ్యూస్ అమ్ముకునే మహిళ



అదిగో జలపాతం : చిన్నారికి ఎత్తిపోతల జలపాతాను చూపిస్తున్న తల్లి



నిండు కుండ : నీటితో కళకళలాడుతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు



గుర్తుండిపోవాలి : సెల్ఫీ దిగుతున్న పర్యాటకులు

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, నల్లగొండ

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బీబీనగర్: మండలంలోని పడమటిసోమారం గ్రామ పరిధిలో గల కేఎస్ఎస్ వెంచర్‌లో ఆదివారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని మల్లాపూర్ పరిధిలో గల అశోక్‌నగర్‌కు చెందిన బొంత ముత్యాలు(60) బీబీనగర్ మండలం పడమటిసోమారం పరిధిలోని కేఎస్ఎస్ వెంచర్‌లో కుటుంబంతో కలిసి నివాసముంటూ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి బహిర్భూమికి వెళ్లిన ముత్యాలు వెంచర్‌లోని వాటర్‌ట్యాంక్ వద్ద అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ముత్యాలు తిరిగి ఇంట్లోకి రాకపోవడంతో అతడి భార్య నాగమ్మ బయటకు వెళ్లి చూడగా ముత్యాలు విగతజీవిగా ఉండటం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పులు చేసి ఉడాయించిన నిందితుల రిమాండ్

వలిగొండ: అధిక వడ్డీ ఆశ చూపి పెద్ద మొత్తంలో అప్పులు చేసి పారిపోయిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం గొల్నేపల్లికి చెందిన కొర్లపల్లి వెంకటేశ్వర్లు, కొర్లపల్లి ప్రశాంత్, కొర్లపల్లి అనిల్‌కుమార్ అన్నదమ్ములు. వెంకటేశ్వర్లు, ప్రశాంత్ గ్రామంలో వేర్వేరుగా కిరాణా దుకాణాలు నడిపిస్తున్నారు. అనిల్‌కుమార్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వీరు ముగ్గురూ కలిసి కిరాణ దుకాణాల పెట్టుబడి కోసం గ్రామస్తులకు అధిక వడ్డీ ఆశచూపి సుమారు రూ.1.50 కోట్లు అప్పులు చేసి ఊరు వదిలి పారిపోయారు. అప్పులిచ్చిన బాధితులు పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఊరు వదిలి పారిపోయిన ముగ్గురి నిందితుల జాడ తెలుసుకున్న పోలీసులు సోమవారం వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సూర్యాపేటటౌన్: మానసికస్థితి సరిగ్గా లేని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం జరిగింది. పట్టణ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం పిన్నాయిపాలెం గ్రామానికి చెందిన ఉప్పల మురళి(26)కి కొంతకాలంగా మానసిక్థితి సరిగ్గా ఉండటం లేదు. దీంతో కుటుంబ సభ్యులు అతడికి హైద్రాబాద్‌లో చికిత్స చేయించారు. అయినప్పటికీ అతడిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన మురళి సోమవారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరి జిల్లా కేంద్రంలోని చింతల చెర్వు కట్ట సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

మహిళ ఆత్మహత్యపై కేసు నమోదు

నకిరేకల్: మండలంలోని నోముల గ్రామానికి చెందిన యల్మకంటి రజిత ఈ నెల 2వ తేదీన ఆత్మహత్య చేసుకోగా.. సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీఐ రాజశేఖర్ తెలిపారు. నోముల గ్రామానికే చెందిన టేకుల రాజేష్ వేధింపులకు గురిచేయడంతోనే తన ఆత్మహత్యకు పాల్పడిందని సోమవారం మృతురాలి భర్త శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

హాస్టల్ కేటాయించొద్దని ఆందోళన

- మాడ్గులపల్లి కేజీబీవీ విద్యార్థినులను వేములపల్లి ఆదర్శ పాఠశాలకు తరలించిన అధికారులు
- ఎక్కువ మంది ఉంటే ఇబ్బందులు ఎదురవుతాయని ఆదర్శ పాఠశాల విద్యార్థుల నిరసన



వేములపల్లి ఆదర్శ పాఠశాల ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

వేములపల్లి: మాడ్గులపల్లి కేజీబీవీకి చెందిన సుమారు 80మంది విద్యార్థినులను సోమవారం వేములపల్లిలోని ఆదర్శ పాఠశాలకు తరలించడంతో ఆదర్శ పాఠశాల విద్యార్థినులు హాస్టల్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. కేజీబీవీకి విద్యార్థినులను తమ హాస్టల్ ప్రాంగణానికి తరలిస్తే ఒక్కో గదిలో 30 నుంచి 35మంది ఉండాల్సిన పరిస్థితి ఉంటుందని ఆదర్శ పాఠశాల విద్యార్థినులు వాపోతున్నారు. కాలకృత్యాలు, స్నానాలు చేసి తరగతులకు వెళ్లాలంటే ఆలస్యమవుతుందని, ఇరుకు గదుల్లో అధిక మంది ఉంటే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేజీబీవీ విద్యార్థినులను వేరో చోటుకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా అక్కడికి చేరుకున్న జీసీడీఓ సరిత, ఎంఈఓ బాలాజీనాయక్ మాట్లాడుతూ.. రెండు పాఠశాలల విద్యార్థినులకు సమస్యలు తలెత్తకుండా చూస్తామని, ఆగస్టు 15 తర్వాత కేజీబీవీ విద్యార్థినులను వేరే చోటుకు తరలిస్తామని హామీ ఇవ్వడంతో ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ఆందోళన విరమించారు.

ఇబ్బందులకు గురి చేయడం సరికాదు..

తాము గతంలో శెట్టిపాలెంలో ఉండగా.. తిప్పర్తికి మార్చారని తిరిగి అక్కడ సమస్య ఎదురైతే వేములపల్లి ఆదర్శ పాఠశాలకు మార్చారని, ఇలా ఎన్నిసార్లు తమను మార్చి ఇబ్బందులకు గురి చేస్తారని మాడ్గులపల్లి కేజీబీవీ విద్యార్థినులు వాపోతున్నారు. ఇక్కడ మమ్మల్ని పదిరోజుల పాటు ఉంచి మళ్లీ ఎక్కడికి పంపిస్తారో అర్థంకావడం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో తాము చదువు కొనసాగించలేమని, తమను ఇంటికి పంపించి ప్రత్యామ్నాయ భవనం చూసాకే పాఠశాలకు రప్పించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

బీసీ వర్గీకరణ కూడా చేపట్టాలి

- ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సూర్యాపేట: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, బీసీల్లోనూ అత్యంత వెనుకబడిన వర్గాలు ఉన్నందున వారందరికీ రిజర్వేషన్లు అందాలంటే బీసీ వర్గీకరణ కూడా చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే జీఓలు వచ్చాయని, తదనంతరం ఎన్నో పోరాటాల ఫలితంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలో మరింత వెనుకబడిన కులాలకు కోటాలు ఇచ్చుకోవడానికి అనుమతించడం సానుకూలమైన అంశమని అన్నారు. వర్గీకరణ అమలులోకి వచ్చిన తర్వాతనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసివచ్చే పార్టీలను కలుపుకొని ఎక్కువ స్థానాల్లో గెలిచేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రుణమాఫీ విషయంలో షరతులు లేకుండా రైతులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కొన్ని జిల్లాల్లో రుణం తీసుకున్న వ్యక్తి చనిపోతే రుణమాఫీ కావడం లేదన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న లిఫ్టుల నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నప్పటికీ కొన్ని హామీలు మాత్రమే అమలు చేసిందని, మిగతా హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున ప్రభుత్వం వెంటనే రైతు భరోసా విడుదల చేయాలని కోరారు. కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను నివారించాలని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపెల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, నగరపు పాండు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం, పక్కన జూలకంటి రంగారెడ్డి తదితరులు

రవాణా రంగం సమస్యల పరిష్కారానికి కృషి

- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడరూరల్: రవాణా రంగంలోని సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలో నిర్వహించిన కోదాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ స్వర్ణోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో రవాణా రంగంది కీలకపాత్ర అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సింగిల్ పర్మిట్ విధానాన్ని అమలు చేయాలని, పాత లారీలకు గ్రీన్ ట్యాక్స్ తగ్గించడంతో పాటు రాష్ట్రానికి చెందిన వేల లారీలు ఎక్కువగా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సరుకు రవాణా చేస్తుంటాయని వాటికి కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు జారీ చేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరడమే కాక యజమానులకు డబ్బు ఆదా అవుతుందని మంత్రి దృష్టికి ఆలిండియా లారీ అసోసియేషన్ సభ్యులు తీసుకెళ్లారు. అదే విధంగా పెరిగిన ఇన్సూరెన్స్‌లు, డీజిల్ ధరలతో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. లారీ యజమానుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, కోదాడ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కనగాల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఆలిండియా మోటార్స్ ట్రాన్స్‌పోర్ట్ చైర్మన్ షణ్ముగప్ప, సౌత్ ఇండియా మోటార్స్ ట్రాన్స్‌పోర్ట్ వైస్ ప్రెసిడెంట్ అరవింద్ అప్పాజీ, ఏపీ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌నాయుడు, తెలంగాణ ప్రెసిడెంట్ అంజిరెడ్డి, రామినేని శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, తూనం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి యువకుడు మృతి



శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

సంస్థాన్ నారాయణపురం: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన సంస్థాన్ నారాయణపురం మండలం చిమిర్యాల గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చిమిర్యాల గ్రామానికి చెందిన మల్లేపల్లి రాంరెడ్డి-విజయలక్ష్మి దంపతుల కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి(37) జేసీబీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం గ్రామంలోని ఓ శుభకార్యానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్తుండగా.. కల్వర్టు వద్ద బైక్ అదుపుతప్పడంతో గుంతలో పడిపోయాడు. గుంతలోని రాళ్లు శ్రీకాంత్ తలకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సోమవారం ఉదయం గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..



మల్లేష్ (ఫైల్)

కొండమల్లేపల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి కొండమల్లేపల్లి మండల కేంద్రంలో జరిగింది. పెద్దవూర మండలం పోతునూరు గ్రామానికి చెందిన జనిగల మల్లేష్(28) కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ట్రాక్టర్ షోరూంలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పని ముగించుకుని తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. చిన్నఅడిశర్లపల్లి గ్రామ పరిధిలో గల హరిత హోటల్ ముందు గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేష్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఏరియా ఆస్పత్రిక తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కనగల్: మండల కేంద్రంలోని కొంపెల్లి వెంకన్న ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, కనగల్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు కనగల్ ఎస్ఐ పి. విష్ణు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆటో.. ఒకరు మృతి



తావు (ఫైల్)

కొండమల్లేపల్లి: కుక్క అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి వ్యక్తి మృతి చెందాడు. కొండమల్లేపల్లి ఎస్ఐ రామ్మూర్తి తెలిపిన ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలం బాలాజీనగర్ గ్రామానికి చెందిన మెగావత్ తావు(55) కిరాణ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో పక్షవాతంతో ఆయనకు ఒక చెయ్యి మాత్రమే పనిచేస్తుంది. ఆ ఒక్క చేతితోనే ఆటో కూడా నడుపుతుంటాడు. సోమవారం ఉదయం కిరాణ సామాను కోసం ఆటో నడుపుకుంటూ కొండమల్లేపల్లికి వస్తుండగా చౌరస్తా వద్ద అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. తావు తలకు తీవ్ర గాయం కాగా.. స్థానికులు దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం

నాంపల్లి: ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని సోమవారం నాంపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలం రేఖ్యాతండాకు చెందిన రమావత్ సుధాకర్ బెల్ట్ దుకాణం నిర్వహిస్తూ.. ఇంట్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో అతడి ఇంటిపై దాడి చేసి రూ.20వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయిపై పటిష్ట నిఘా

- ఇప్పటి వరకు ఐదు కేసుల్లో 35మంది అరెస్ట్
- 150 కేజీల గంజాయి పట్టివేత
- మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు



మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: గంజాయిపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఐదు గంజాయి కేసుల్లో 35 మందిని అరెస్టు చేశామని, 150 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గంజాయి విక్రేతలు, సేవించే వారిలో మార్పు తెచ్చేందుకు మిషన్ పరివర్తన్ పేరుతో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 25మందిని జిల్లా కేంద్రానికి పంపించి కౌన్సిలింగ్ ఇప్పించామని పేర్కొన్నారు. కౌన్సిలింగ్ తీసుకోని వారికి పరీక్ష చేయగా ఇద్దరికి పాజిటివ్ రావడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ తీసుకున్న వారిపై నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐలు వీరబాబు, సుధాకర్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 104 అంబులెన్స్ డ్రైవర్ దుర్మరణం



శ్రీనివాస్(ఫైల్)

అర్వపల్లి: బైక్‌పై వెళ్తూ రోడ్డు క్రాస్ చేస్తున్న 104 అంబులెన్స్ డ్రైవర్‌ను కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్వపల్లికి చెందిన లింగంపల్లి శ్రీనివాస్(45) కొంతకాలంగా తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో 104 అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి అర్వపల్లిలోని దేవాలయం రోడ్డుకు బైక్‌పై వెళ్లి తిరిగి తన ఇంటివైపు వెళ్తూ సూర్యాపేట-జనగామ 365బీ జాతీయ రహదారిని క్రాస్ చేస్తుండగా.. విజయవాడ నుంచి జనగామ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్ కారు బానెట్‌పై ఎగిరిపడగా కొంతముందుకు వెళ్లాక.. కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సీహెచ్. బాలకృష్ణ తెలిపారు. శ్రీనివాస్ కుమార్తె తేజ జపాన్ దేశంలో ఉద్యోగం చేస్తోందని, ఆమె అక్కడి నుంచి వచ్చిన తర్వాత మంగళవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

కుమార్తె పెళ్లి చేయాలనే కోరిక తీరకుండానే..

తన కుమార్తె పెళ్లి చేస్తే తన కష్టాలు తీరిపోతాయని శ్రీనివాస్ ఇటీవల తన స్నేహితులు, బంధువుల వద్ద చెప్పినట్లు తెలిసింది. అయితే ఆయన ఆ కోరిక తీరకుండానే కానరాని లోకాలకు వెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు విలపించారు.